# పొగరానిచిచ్చు

డ్యూటీకి అయిదు నిమిషాలు ఆలస్యం అయితే కాజువాలిటీ మెడికల్ ఆఫీసర్ కొట్టడు కాని, అంతకంటె కసిగా చూస్తాడు. ఎనిమిదై పోయింది. ఇప్పుడెలా? టేబిల్ మీద తన ఫోటో వెనక రాత్రి తను ఇంజెక్షన్ చేసిన సిరంజీ, పరుపు మీద ఆమె పెట్టుకున్న మల్లెచెండూ అలానే ఉన్నాయి. ఏడు గంటలకు అలారమ్ పెట్టే ఉంది. నిద్రలో బటన్ నొక్కేసి ఉంటాననుకున్నాడు కుమార్. షార్ట్‌కట్‌లో కాజువాలిటీ వార్డు చేరుకుని జూనియర్ హౌస్‌మెన్ గదిలో అడుగు పెట్టాడు.

"ఈ వేళ ఆదివారం. గురుడు ఎనిమిదింటికి ప్రత్యేకం వస్తాడని తెలిసి కూడ ఎందుకింత ఆలస్యం చేశావు?"

సి.ఎమ్.ఒ. రావడం తనకు పెట్టవలసిన నాలుగూ రావు దగ్గర పెట్టి వెళ్లి పోవడం జరిగింది.

"రాత్రి ఆలస్యం అయిపోయింది. అయినా, ఈరూల్సన్నీ స్టుపిడ్!"

"స్నానం చేశావా, లేదా?"

"స్నానమేమిటి నా మొహం! అసలు కాఫీ తాగందే ... ఒయ్, చిరంజీవి!"

"బాస్ వెనక వెళ్లాడు."

"సరే. నే వెళ్లి కేకేసుకు వస్తాను."

హౌస్ సర్జన్ రూమ్‌లోంచి ఎమర్జెన్సీ థియేటర్, ఎక్స్‌రే రూమ్, డ్రెస్సింగ్ రూమ్ దాటి సి.ఎమ్.ఒ. గదివైపు నడుస్తున్నాడు కుమార్.

"యు ఆర్ లేట్ అగైన్!"

గదిలోంచి బయటకు వస్తున్నాడు ఆయన.

"ఐయామ్ సారీ, సర్. రూమ్‌లో ..."

"ఎ రొటీన్ లై!"

'లై'కి రెండు అర్థాలు ఉన్నాయన్న విషయం చెళ్లమని కొట్టవచ్చి నట్టు గుర్తొచ్చింది. ఆదివారం కావటం మూలాన మెల్లగా నిద్ర మేల్కొంటుంది ఆస్పత్రి.

"గో టు యువర్ డ్యూటీ!"

"ఫూల్! తన దగ్గరకు క్షమాపణ చెప్పడానికి వచ్చాననుకుంటు న్నాడు, సింగిల్ ట్రాక్ మైండ్" మనసులో గొణుక్కుని వెనక్కి తిరిగాడు కుమార్.

"మార్నింగ్, డాక్టర్!"

"మార్నింగ్."

"నీ నుంచే!"

"అలారం పెట్టాగా!"

"లోపలకురా!" కుమార్ గడగడలాడాడు. ఆ సి.ఎమ్.ఒ. కంట పడితే ఇంకేమైనా ఉందా? నలుగుర్లోనూ కడిగేస్తాడు పట్టుకుని. కుమార్ గదిలోకి రాగానే రావు బయటకు వెళ్లాడు.

"డియర్, హౌ ఆర్ యూ!" భుజం మీద చెయ్యి వెయ్య బోయాడు.

"బాస్!" స్వింగ్ డోర్స్ క్రింద నించీ బాస్ జోళ్లు కనిపించాయి. సి.యమ్.ఒ.కి అటాచ్ కావడం, అతని దగ్గర కనీసం నాలుగు వారాలు శుశ్రూష చెయ్యడం ప్రతి హౌస్ సర్జన్ చెయ్యవలసిన డజనున్నర చిల్లర పనుల్లో ఒకటి. అతని చేతుల్లోంచి సంవత్సరానికి ఓ వంద మంది వైద్యులుగా బయటకు వెళుతూనే ఉంటారు. అతని వయసులో వాళ్లందరికీ ఏనాడో ప్రమోషన్లు వచ్చేశాయి. కాని, సి. ఎమ్. ఒ. మాత్రం వేసిన తివాసీలాగే ఉండిపోయాడు. కారణం అరవై అయిదులో హౌస్ సర్జన్‌గా చేసిన రాజు ద్వారా ఒకరి వద్ద నుంచి మరొకరికి అనుశ్రుతంగా వివరింపబడుతూ వచ్చింది. ఆ ఓల్డ్ స్టూడెంట్, అప్పటి మరో హౌస్ సర్జన్‌కి అసలు విషయం చెప్పాడట.

"బాస్ చాలా మంచివాడు. ఆ మోటుతనం, కరుకుదనం అంతా బయటికే. అతని ఇంటికి ఎప్పుడైనా వెళ్లావా? ఆయన భార్య ఎ గ్రేట్ లేడీ! ఎంత ఆప్యాయత పడుతుందనీ! పాపం, ఆమెకు పిల్లలు లేరు. తండ్రి కావలసిన ప్రమోషన్ అడ్డేశాడు భగవంతుడు. ఆస్పత్రి ప్రమోషన్ ఏమాత్రం? ఎవరికో ఎక్స్-రే తియ్యలేదని, అప్పటి సూపరింటెండెంట్ కాన్ఫిడెన్షియల్ రిపోర్టు ఖరాబు చేశాడట. అసలు రహస్యం ఇది."

సి ఎమ్.ఒ. నిజస్వరూపం తెలుసుకునే అవకాశమే దొరకలేదు కుమార్‌కి. ఈ వార్డులో పోస్టింగ్ రావడానికి నాలుగు వారాల ముందు నుంచి సులోచనతో షికార్లుతో సరిపోతోంది.

"సార్! పిలిచారట. సిస్టర్ పంపారు." వార్డ్ బోయ్ వచ్చాడు.

"మూడు మసాలా, మూడు ప్లేట్ ఇడ్లీ, మూడు నెస్. తొందరగా రావాలి." పది కాగితం ఇచ్చాడు కుమార్.

అతను వెళ్లాక అడిగాడు రావు – "ఎంతవరకూ వచ్చింది, మీ వ్యవహారం" అని.

"ముగింపు మామూలే!"

"ఆమెకు తెలుసా?"

"బాగా నిద్ర పట్టాక కొకైన్ స్ప్రే చేసి మరీ ఇచ్చాను! పూర్ గర్ల్, ఏమిటో అనుకుంటోంది. ఐ పిటీ హర్!"

"ఏమిటో పిటీ అంటున్నారు?" కేస్‌షీట్ ఫారమ్ తీసుకోవడానికి లోపలికొచ్చింది సులోచన.

"బాస్‌కి పిల్లలు లేరట, కుమార్ చెబుతున్నాడు!" రావు అందుకున్నాడు. నర్స్ యూనిఫారంలో ఉన్న ఆమె నడుము వైపు చూసి కిటికీ వైపు తిరిగాడు కుమార్.

"మనవాడు నాకు స్పృహ ఉండగా కాఫీ తెస్తాడంటావా?" ఒక కుర్చీలో కూలబడి మరో కుర్చీలో కాళ్లు చాపబోయి తమాయించుకున్నాడు.

"మళ్లీ వస్తాను!"

ఆమె గదిలోంచి వెళ్లే వరకూ ఆమె నడుం వంకే చూస్తున్నాడు కుమార్. కళ్లు తెరిచే సరికి బాయ్ పొట్లాలు టేబిల్ మీద పెడుతున్నాడు.

"ఫార్టీ ఎయిట్!"

"వాట్?" లేని కళ్లు నులుపుకున్నాడు కుమార్.

మనవాడు కాఫీ తీసుకు రావడానికి నలభై ఎనిమిది నిమిషాలు పట్టింది. రాత్రిల్లా నీకు నిద్రలేదల్లే ఉందే?

"పడుకునే సరికి మూడు. సెకెండ్ షో ... బోయ్, నువ్వెళ్లి సిస్టర్‌ని ఓసారి రమ్మంటావా?"

సులోచన రాగానే పొట్లాలన్నీ విప్పేశారు. ఇడ్లీలయిపోయాయి. మసాలా దోశలో ఉండగా – "ఎవరో వచ్చారు, సార్!" అంటూ లోపలకి వచ్చాడు వార్డ్ బోయ్

కుమార్ బయటకు వచ్చి చూశాడు. పోలీసు టోపీ కనబడింది. లోపలకు వచ్చి దోశ చకచక లాడించి చెయ్యి కడుక్కున్నాడు.

ఈలోగా సిస్టర్ మూడు కప్పుల్లో కాఫీ పోసింది.

రెండు గుక్కల్లో కాఫీ మింగేసి "చెప్పండి" అంటూ గదిలోకి అడుగు పెట్టాడు కుమార్.

తను చెప్పనక్కర లేకుండానే కోచ్ మీద పడుకోబెట్టాడు డ్రెస్సింగ్ రూమ్‌లో ఆస్పత్రి అంటే అసలు భయం లేని కనకయ్య.

"రెండు రోజులైంది సార్! గొప్పబాధ పడిపోతున్నాడు. నిక్కరు విప్పనివ్వడం లేదు. బాగా వాచిపోయి ఒకటికి కూడా వెళ్లలేక పోతున్నాడు."

"ఏదీ చూడనివ్వు ... ఏం కాదులే, బాబూ! నేబాగు చేస్తాగా. ఇదిగో చూడు."

"వాట్ ఈజ్ ది మాటర్?" రావు వచ్చేశాడు వెనకాలే సిస్టర్.

"ఆఁ గుడ్ బాయ్! సిస్టర్, నిక్కర్ విప్పండి." తన ప్రొఫెషనల్ సుపీరియారిటీని ఎసర్ట్ చేసుకున్నాడు. పన్నెండు వేల తెల్లధనంతో మరో ఎనిమిది వేల నల్లధనం జోడించి అడ్మిషన్ కొనుక్కున్నాడు కుమార్.

రావుకి ఆత్రంగానే ఉంది తనంతట తనే ఆ కేసు చూద్దామని.

"అమ్మోయ్, బాబోయ్!" ఏడుపు లంకించుకున్నాడు బల్లమీద ఉన్న కుర్రాడు.

ముందుకు వంగి చూశారు ముగ్గురూ.

"పేరాఫై మోసిస్!" కుమార్ కేస్‌షీట్ వేసి - ప్రశ్నలు వేస్తూ ఫారం పూర్తి చేశాడు.

"జస్ట్ ఎబిట్ ఆఫ్ సర్జరీ... ఉయ్ విల్ డూ ఇట్ రైట్ ఎవే... చాలా చిన్న ఆపరేషన్. ఒక్క అయిదు నిమిషాలు అంతే."

కనకయ్య ఓ క్షణం ఆలోచించాడు.

రెండు రోజుల నుంచి క్యాంపు మీద వెళ్ళిన కనకయ్య గత రాత్రే ఇంటికి వచ్చాడు. భార్య లబోదిబోమంది. తెల్లవారగానే యూనిఫారం వేసుకొని పెద్దసుపత్రికి తీసుకొచ్చేడు కనకయ్య కొడుకుని.

"సరే, చేసెయ్యండి, సార్! మరో పద్ధతి లేని తరువాత తప్పుతుందా మరి?" అబ్బాయిని మెల్లగా నడిపించుకుంటూ థియేటర్లోకి తీసుకు వెళ్లారు.

తలుపులు వేశేశారు.

"ఎంత మంది పిల్లలు, జమానుగోరూ?" చిరంజీవి జేబులోంచి బీడీ తీస్తూ అడిగాడు.

"ఒక్కడే బాబూ. అయితే, ఆపరేషన్ అయిపోగానే ఇంటికి తీసుకు పోవచ్చా?"

"ఓ! దానికేటి సిన్న ఆపరేసనంతే!"

లోపల తన విజ్ఞాన ప్రదర్శనకు అవకాశం వచ్చింది కనక ఇద్దరూ తెగ ఘర్షణ పడ్డారు – రావూ, కుమార్.

"లోకల్ చాలా్రి, దీనికి జనరల్ ఎందుకు?"

"బాగుంది. పెద్ద సర్జన్‌లా చెబుతున్నావు! ఒక్క పిసరు కదిపితే ఏమవుతుందో తెలుసా?"

సిస్టర్ సులోచనకి కొంచెం వీక్‌గా ఫీలవుతున్నట్టు అనిపించింది. "రాత్రి నిద్ర లేకేమో లే?" అని ఊరుకుంది.

టేబిల్ మీద కుర్రాడు వింతగా డాక్టర్ వైపు చూస్తున్నాడు.

"ఆల్‌రైట్! జనరల్ ఎనస్థీషియా చేద్దాం సరే, నువ్వే ఇవ్వు. నేను ఆపరేట్ చేస్తాను" అన్నాడు రావు.

"సిస్టర్, ఆల్ రెడీ? క్రిందటికి ఏమయిందో తెలుసా? ప్రొఫెసర్ ఘనీ ఆపరేషన్ చేస్తుండగా 'స్కాల్పెల్' అడిగారు. సిస్టర్ ఇచ్చిన స్కాల్పెల్ మీద తుప్పు. టేబిల్‌లో గుచ్చేసి మాస్క్ విసిరేసి బయటకు వెళ్ళిపోయాడట. ఆయనకి కోపం వస్తే ఆరోజు మరి థియేటర్లోకి రాడట."

థియేటర్లో గడగడా వాగుతుండడం ప్రొఫెసర్ ప్రసాదరావుగారి చుట్టుచేరి సర్జరీ నేర్చుకున్న వాళ్లందరిలోకీ బాగా పట్టుబడింది రావుకే.

"ఏది, బాబూ కళ్లు మూసుకో. అంకెలు ఒకటీ, రెండూ, మూడూ – చెప్పు బాబూ!" మాస్క్ మీదకు లాక్కున్నాడు కుమార్.

"ఒకటీ, రెండూ ... మూ ... డూ."

"సిస్టర్, నైఫ్ ... " రావు అరిచేశాడు ఆత్రుతగా.

"వండర్‌ఫుల్! కుర్రాడు కదల్లేదురా. మరొక్క నిమిషంలో అయిపోతుంది."

నైఫ్ బేసిన్‌లో పడేసి, కట్ డ్రెస్ చేసేసి గాజూ, కాటనూ బాండేజి తల ఎత్తాడు రావు.

కుమార్ తనే మత్తు మందు పీల్చినట్టు అర్ధనిమీలిత నేత్రాలతో ఉన్నాడు.

"నీ దుంప తెగ, ఇక తీసెయ్!" రావు రంకె వేశాడు.

"ఆఁ! ఆఁ!" ఉలిక్కి పడ్డాడు కుమార్.

"కుర్రవాడికి తెలివి వచ్చేవరకూ ఇక్కడే ఉంచుదాం. వెంటనే పంపెయ్య వచ్చు."

చేతులు కడుక్కుని టవల్‌తో తుడుచుకుని రూమ్‌లోకి వచ్చి సిగరెట్టు ముట్టించాడు.

కుమార్ మరో నిమిషంలో వచ్చి కూర్చున్నాడు.

"ఎలా అయింది బాబూ?" స్వింగ్ డోర్స్ లోంచి సాతంలో పలికి రాకుండా అడిగాడు కనకయ్య.

"సక్సెస్ ఫుల్! కొద్ది సేపట్లో తెలివి వస్తుంది. తీసుకెళ్ల వచ్చు. బయట కూర్చోండి." కిటికీ లోంచి చూస్తూ గుప్పు గుప్పున పొగ వదులుతున్నాడు కుమార్.

సిస్టర్ హడావుడిగా గదిలోకి వచ్చింది.

"బోయ్ కొలాప్స్ అయిపోయినట్టున్నాడు. పల్స్ లేదు."

"వాట్?!" ముందు రావు బయలు దేరాడు.

"చిరంజీవి ఎక్కడ?" కుమార్ బయటకి వెళ్లాడు.

చిరంజీవిని బాస్ గదిలోకి తీసుకెళ్లి నంబర్ అడిగాడు. కుర్రవాడి పల్స్ స్వయంగా చూస్తేనేగాని నంబర్ ఇవ్వలేదు స్వామి భక్తుడు.

ఫోన్ దగ్గరి 'కెళ్లాడు కుమార్.

వరండా మీద కూర్చున్న కానిస్టేబుల్ వాళ్ల హంగామా చూసి చిరంజీవి అడిగాడు. "ఏటి బాబూ, ఏదైనా ప్రమాదమా?" అని.

"నువ్వూరుకోవయ్యా, మగడా!" దులిపేసుకున్నాడు చిరంజీవి.

ఆఫీసు గదిలోకి వచ్చేశారు వరసగా రావు, కుమార్, సిస్టర్ సులోచన.

"మన సూపరింటెండెంటుతో చెప్పలేమో? ఆరోగ్యంగా ఉన్న వాడికి ఆపరేషన్ చేసి శవాన్నిలా అప్పగించగలం? అయినా అంత ఎనస్తీస్సియా ఇచ్చుకుంటారా? యూస్‌లెస్ ఫెలో!"

"నువ్వు చూసుకో అక్కర్లే! పెద్ద సర్జన్‌లా చకచక లాడించే శావు కదా!" బుంగమూతి పెట్టాడు కుమార్.

"బాబూ, బాబు నోమారు చూడొచ్చా!" కాన్‌స్టేబుల్ అడిగాడు.

"వద్దొద్దు. ఇంకా తెలివి రావడానికి కొంచెం సేపు పడుతుంది." కుమార్ గోడవైపు చూస్తుండగా చిరంజీవి చెప్పాడు. "బయట కూర్చోండి."

"బాస్ ఏమన్నారూ?"

కొంచెం గుండె దడదడ లాడుతున్నట్లయింది సులోచనకి.

"వాట్ బాయిస్?" అంటూ రానే వచ్చారు సిఎమ్ఒ అబ్బాయిని చూసి అతనికి కళ్లనీళ్ల పర్యంతం అయింది. "యూ, ఫూల్స్!" అంటూ టెలిఫోన్ వైపు నడిచారు.

మరో పదినిమిషాల్లో సూపరింటెండెంటు రావడం చూసి ఫెయింట్ అయిపోయింది సిస్టర్ సులోచన.

"లుక్ టు హెర్!" కుమార్‌ను ఆజ్ఞాపించారు ఇలా వత్తిగిల్లించి చూస్తే ఎరుపు కనబడింది.

"కాల్ ది గైనిక్ వార్డ్. అస్క్ ఫర్ ఎస్పైరిచర్." మరో ఆర్డర్ ఇచ్చాడు సూపరింటెండెంటు.

రావు టెలిఫోన్ వైపు పరిగెత్తాడు.

"ఈ అబ్బాయిని కార్డియాలజీ యూనిట్‌కు పంపండి. నేనక్కడికే వెళుతున్నాను." వెనక్కి తిరిగి చూడకుండా వెళ్లిపోయారు సూపరింటెండెంటు.

"బాబూ! బాబూ! నా బాబూ!" అంటూ కనకయ్య స్ట్రెచర్ వెంట బడ్డాడు.

"గుండెపోటు వచ్చింది అబ్బాయికి. వెంటనే మరో వార్డు తీసుకుని వెళుతున్నాం." చిరంజీవి తప్ప మరెవరూ కనకయ్యకు సమాధానం చెప్పలేదు.

సి.ఎమ్.ఒ. తెల్లకాగితం ముందుంచుకుని మరోసారి సిట్టూర్చి పెన్ క్యాప్ తీశాడు.

అతని మౌనం మరీ వాడిగా గుచ్చుకుంటోంది కుమార్‌కి.

"ఇదంతా నాతప్పు, సార్! మత్తు మందు ఇచ్చింది నేను."

"ఒక మూగజీవాన్ని బలిగొన్నావు... నీవ్యక్తిగత జీవితం నా కనవసరం. ఏపరిస్థితులలోనూ మనిషి జీవితంతో ఆటలాడకు."

"సూపరింటెండెంట్ గారూ! సార్" మరో గంటకు రొప్పుకుంటూ వచ్చాడు చిరంజీవి.

"సారీ, ఫెలోస్. కేస్ మడిల్ చేశారు. ఓవర్ ఎంథూజియాజమ్‌తో...పాపం, ఒక్కడే కొడుకట ... ఈ లోగా డి. ఎస్. పి. నుంచి ఫోన్ ... పోస్ట్ మార్టమ్ దగ్గరుండి చేయిస్తున్నాను. కనీసం బాడీ తొందరగా, పాళంగా ఇచ్చెయ్యమని బ్రతిమాలాడు. డెత్ సర్టిఫికేట్ నేను సైన్ చేశాను. 'రెస్పిరేటరీ ఫెయిల్యూర్ ఫాలోయింగ్ కాంజెనిటల్ హార్ట్ డిసీజ్' అని... బాడ్ లక్, అవునోయ్, నువ్వెందుకట రాజీనామా పంపావు?"

"పొరపాటు. ఆస్పత్రిలో ఏలవకతవక జరిగినా బాధ్యత నాదే. చేస్తే రాజీనామా నేను చెయ్యాలి. ఇంకా పోతే, డి. ఎమ్. ఎస్. ఇంకా పోతే హెల్త్ మినిష్టర్ – అంతా చేసెయ్యాలి. నేరస్తుల మీద సరి అయిన ఏక్షన్ తీసుకోవలసిన బాధ్యత మనది."

సి. ఎమ్. ఒ. పంపిన రాజీనామా ముక్కలు ముక్కలుగా చింపి కింద బుట్టలో పడేశారు సూపరెంటెండెంటు.

"నో యంగ్ మేన్! దీనికి బాధ్యులెవరు?" గద్దించారు.

రావు గడగడ లాడిపోయారు.

కుమార్ గొంతు తడి ఆరిపోతుండగా ధైర్యం చిక్క బట్టుకుని ప్రారంభించాడు. "నేను, సార్! మీరు విధించిన శిక్ష స్వీకరిస్తాను."

"రెండు ప్రాణాలు తీశావు... సిస్టర్ సులోచన గైనిక్ వార్డులో ఉంది. నాకంతా చెప్పింది. మన చదువులు జీవితాలని కాపాడడానికి. నిండు ప్రాణాలని తియ్యడానికి కాదు. నీలాంటి కామిరులంతా జీవితాన్ని కృత్రిమ మార్గాల ద్వారా ఆనందాన్ని నింపుకోవడం కోసం వైద్య విజ్ఞానాన్ని వాడుకోవడం అన్యాయం, అమానుషం ..." లేచి నిలుచున్నారు సి.ఎమ్.ఒ. తలవంచుకుని వెళ్ళిపోయారు సూపరింటెండెంట్.

కారులోనే కూర్చున్న శాంతాదేవి భర్త ముఖం చూసి అడుగుదామనుకున్న ప్రశ్న అడగనే లేదు.

"ఒక్కడే కొడుకట! పిటియబుల్!" నిట్టూర్చేడు సి. ఎమ్. ఒ. వెళ్ళి చూద్దాం అంది శాంతాదేవి.

కనకయ్య భార్య తన కళ్లను నమ్మలేదు — పోలీసు వాన్ లోంచి కొడుకుని ఎత్తుకుని దింపుతుంటే.

గోడవైపు చూస్తూ పడుకుంది గైనిక్ వార్డులో సిస్టర్ సులోచన. కారు దిగబోతున్న శాంతాదేవిని ఆపారు సి.ఎమ్.ఒ.

"అతణ్ణి ఓదార్చే శక్తి ఆ భగవంతుడికే ఉంది."

కొంతమంది గుండెల్లో రగులుతున్న చిచ్చుకు పొగ రాదు.

ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక 28-7-76 లో ప్రచురితమైనది.